క్లుప్తంగా

50శాతం వడ్డీ మాఫీ



మునిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు

పార్వతీపురం టౌన్: ఆస్తి, ఖాళీ స్థల పన్నులపై 50శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీలోగా ఆస్తి, ఖాళీస్థల పన్నులు చెల్లించిన వారికి వడ్డీమాఫీ ఉంటుందని చెప్పారు. సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయం పనివేళల్లో చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేరంగిలో తాగునీటి సమస్య



కేరంగిలో పూడుకుపోయిన బావి

సాలూరు: పాచిపెంట మండలంలోని గిరిశిఖర కేరంగి పంచాయతీ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరారు. గ్రామ సమీపంలో గతంలో తీసిన బావి నుంచి గ్రామస్తులు నీరు పొందేవారు. గత ఏడాది వచ్చిన తుఫాన్ వల్ల బావి ప్రహరీ పగిలి కోతకు గురైంది. దీనితో మట్టి చెత్తా చెదారాలు బావిలో పడి పూడుకుపోయింది. ఫలితంగా గ్రామస్తులు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వేసవిని దృష్టిలో పెట్టుకొని వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శుల నియామకం

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి పార్టీ అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా యాండ్రాపు తిరుపతినాయుడు, జాయింట్ సెక్రటరీగా సంఘం నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా గండి భాగ్యవతి, రాష్ట్ర వలంటీర్ వింగ్ సెక్రటరీగా తెరి హేమలత, రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా జక్కు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర వీవర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఐక అప్పన్న నియమితులయ్యారు.

లెప్రసీ రోగులకు వస్త్రాల పంపిణీ



చిలకలపల్లిలో లెప్రసీ రోగులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి గ్రామంలో లెప్రసీ రోగులకు పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు అన్న, వస్త్రదానాలు చేశారు. తన తల్లి సత్తెమ్మ వర్థంతి సందర్భంగా చిలకలపల్లిలోని లెప్రసీ ఆసుపత్రి రోగులకు వాటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి తన కుటుంబసభ్యులు సహాయసహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీను, ఇ.మధు, జి.శ్రావణ్‌కుమార్‌పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహస్వామికి ముడుపుల పూజలు



కనకంబరాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీ నృసింహ స్వామివారికి గురువారం ముడుపుల పూజలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తులు క్యూలో ఉండి స్వామిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ గావించారు.

22 మందిపై బైండోవర్ కేసులు

సాలూరు: సారా కేసులకు సంబంధించి పలువురిపై తహసీల్దార్ ఎస్వీ రమణ బైండోవర్ కేసులు నమోదు చేశారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో మరిపల్లి, తోణాం, నక్కడవలస గ్రామాలకు చెందిన 22 మందిని బైండోవర్ చేశారని చెప్పారు. వీరు ఏడాదిలోపు ఎక్కడైనా సారా కేసుల్లో పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దాహం కేకలు



వెంగళరాయపురం గ్రామం

- వెంగళరాయపురంలో తాగు నీటి సమస్య
- అడుగంటిన మోటార్ పంపు సెట్లు
- ఆగిపోయిన తాగునీటి సరఫరా
- చుక్క నీటికి అల్లాడుతున్న ప్రజలు

బలిజిపేట: మండలంలోని వెంగళరాయపురం గ్రామస్తులు దాహమో రామచంద్రా..! అంటూ కేకలు పెడుతున్నారు. గ్రామంలో తాగునీటి కష్టాలు తారా స్థాయికి చేరుకున్నాయి. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో మోటార్ పంప్ సెట్లు పనిచేయడం లేదు. రక్షిత మంచినీటి సరఫరా పథకం నుంచి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తాగునీటికి గ్రామస్తులు కటకటలాడుతున్నారు. వీధుల్లో ఉండే బోర్లద్వారా బిందెడేసి నీరు వంతున తెచ్చుకుంటున్నారు. నిరంతరం ఇదే బోరువద్ద నీరు కొట్టినా సక్రమంగా నీరు రావడం లేదని వాపోతున్నారు. గత 15రోజుల నుంచి నీటికి ఇక్కట్లకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల్లో ఉండే పంపు సెట్లు పని చేయడం లేదని అవస్థలు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కొన్ని వీధులకు, ప్రాథమిక పాఠశాల వైపు ఉండే నివాసగృహాల వైపు రక్షిత మంచినీటి పథకం నీరు సరఫరా కాలేదని చెబుతున్నారు. నివాసగృహాల ముందు ఉండే రక్షిత మంచినీటి పైపుల వద్ద గోతులు తీసుకుని లోపల నుంచి ప్లాస్టిక్ గొట్టాలు ఏర్పాటు చేసుకుని వస్తున్న గుక్కెడు నీటిని పట్టుకుంటున్నామని తెలిపారు.

పనిచేయని పంపు సెట్లు

నివాసగృహాల్లో ఉండే మోటార్ పంపుసెట్ల ద్వారా నీరు రాకపోవడం ఇదే ప్రథమమని గతంలో వేసవికాలంలో నీరు వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. మార్చి నెలలోనే నీటి కష్టాలు ప్రారంభమైతే రానున్న వేసవి కాలంలో గ్రామంలో ఉండలేమని లబోదిబోమంటున్నారు. స్నానాలు చేసేందుకు కష్టంగా ఉందని, బిందెడు నీటిని అమృతంలా వాడుకుంటున్నామని చెబుతున్నారు. నేటికి 15రోజుల నుంచి ఇదే తంతు కొనసాగుతోందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టిలో పెట్టినా ఏమాత్రం ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిందెడు నీటికోసం దూర ప్రాంతంలోని పంట పొలాల్లోని మోటార్ పంపు సెట్ల వద్దకు వెళ్లి తీసుకురావాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నీటి కష్టాలను తీర్చాలని మహిళలు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా ఉన్న పాఠశాల వద్ద మోటారు పంప్‌సెట్

కార్పెంటర్లంతా ఐకమత్యంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

పార్వతీపురం టౌన్: కార్పెంటర్లంతా ఐకమత్యంగా ఉండాలని జిల్లా కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.శంకరరావు పిలుపునిచ్చారు. గురువారం కార్పెంటర్స్ డేను పురస్కరించుకొని యూనియన్ సభ్యులు పాత బస్టాండ్ కూడలి నుంచి పార్వతీదేవి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కంకటి వీధి కూడలి వద్ద కార్పెంటర్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులలో ఒక కార్పెంటరీ వృత్తి పనివారి కుటుంబాలు పేదరికంలో జీవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం వృత్తి పనివారిని ఆదుకోడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొంటర్లకు ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్పెంటర్ వృత్తిపని వారికి రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణను ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కార్పెంటర్లు పాల్గొన్నారు.

ఎరువుల డిపోల పరిశీలన

సీతానగరం: రబీ పంటలు సాగు చేస్తున్న రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. లైసెన్స్‌డ్ ఎరువులు డిపోలు, నిడగల్లు రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల డిపోలను గురువారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బూర్జ, నిడగల్లు రైతుసేవా కేంద్రాల్లో యూరియా నిల్వలున్నాయని తెలిపారు. ప్రైవేటు డీలర్లు ఎరువులున్న మేరకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఎరువులు కావలసిన రైతు సోదరులు మండల వ్యవసాయ కార్యాలయం లేదా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఇప్పటికే రెండు విడతలుగా రైతులకు రబీ పంటలు సాగు చేస్తున్న వారందరికీ ఎరువులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రను ప్రారంభించిన డీఈఓ



జెండా ఊపి విజ్ఞాన యాత్రను ప్రారంభించిన డీఈఓ తిరుపతినాయుడు

పార్వతీపురం టౌన్: విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక చారిత్రక విజ్ఞాన ఆలోచనను, శక్తిని పెంపొందించేందుకు విజ్ఞాన విహార యాత్రలు దోహదపడతాయని డీఈఓ ఎన్.తిరుపతినాయుడు అన్నారు. విద్యార్థుల విద్య, విజ్ఞాన యాత్రల్లో భాగంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 5, 9 తరగతులకు చెందిన 130 మంది విద్యార్థులను సైన్సు ఎక్స్‌పోజర్ విజ్ఞాన యాత్రను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్రలో భాగంగా ఒడిశా రాష్ట్రం జేకేపేపర్, ఏఆర్‌ఫుడ్ అండ్ బేవరైజెస్ లిమిటెడ్, కాటన్ ఇండస్ట్రీ, నాగావళి ప్లాంటోరియం, జంఝావతి రబ్బరు డ్యాం పరంపద పార్క్ ప్రాంతాలను విద్యార్థులు సందర్శించడం జరిగిందన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



డీఈఓ తిరుపతినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: పదో తరగతి మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. ఈ మేరకు డీఈఓ ఎన్.తిరుపతినాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ సబ్జెక్టుల మూల్యాంకనం జిల్లాలోనే నిర్వహించాలన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి, బాలింతలు, గర్భిణులుగా ఉన్న వారికి, ఈ ఏడాది పదో తరగతి సబ్జెక్టులు బోధించని వారికి, ప్రత్యేక అవసరాలు గల వారికి మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పార్వతీపురం రూరల్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులకు రుణాలకు సంబంధించిన ప్రణాళికలు చేయడం జరుగుతుందన్నారు. రుణ ప్రణాళిక యాప్ వినియోగం పట్ల అవగాహన కల్పించి సంబంధిత గ్రామైక్య సంఘ సభ్యుల సహకారంతో యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఎం సన్నిబాబు, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ట్రెంచ్‌లను అడ్డుకునే యత్నం!



రైతులు, సీపీఎం నేతలతో మాట్లాడుతున్న అధికారులు

సీతానగరం:

మండలంలోని అమ్మాదేవి కొండ పరిధి రేపటివలస వద్ద అటవీ శాఖాధికారులు ఏనుగుల కోసం ఏర్పాటు చేస్తున్న ట్రెంచ్‌లను అడ్డుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో రైతులు గురువారం ప్రయత్నించారు. అయితే ఈ యత్నాలను అధికారులు చర్చల ద్వారా విఫలం చేశారు. ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్న భూములకు సంబంధించి నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం నేతలు కృష్ణమూర్తి, రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు తదితరులు కోరారు. అయితే ఈ భూములు ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములని అటవీ పరిహారం చెల్లించనక్కర్లేదని చెప్పారు. ఈ క్రమంలో అక్కడ తహసీల్దార్ ప్రసన్నకుమార్, సీఐ ఎస్.గోవిందరావు రైతులు, సీపీఎం నేతలతో చర్చించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అటవీ శాఖాధికారులు యథావిధిగా ట్రెంచ్‌లను ఏర్పాటు చేసే పనులు కొనసాగించారు.

'పీఎంశ్రీ'తో ఉన్నత పాఠశాల అభివృద్ధి



సీతానగరం ఉన్నత పాఠశాల ప్రాంగణం

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పీఎంశ్రీ పథకం అమలుకు ఎంపికైంది. దీంతో ఈ పాఠశాలలో మౌలిక వసతుల కల్ప, క్రీడా మైదానం అభివృద్ధి జరగనుంది. పీఎంశ్రీ అమలుతో విద్యా బోధనకు కావాల్సిన అదనపు వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానం అభివృద్ధితో పాటు సామగ్రి ఏర్పాటుకు అవకాశం లభిస్తుంది. పీఎంశ్రీ పథకానికి సీతానగరం ఉన్నత పాఠశాల ఎంపికైనట్టు గురువారం సమాచారం రావడంతో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎస్.మహేష్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సింగారపు మహేష్(37) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన సింగారపు మహేష్ కొంతకాలంగా మద్యానికి అలవాటుపడిన కారణంగా తాగడాన్ని నివారించడానికి కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు నచ్చచెప్పినా ఫలితంలేక పోయింది. అలవాటు మానుకోలేని కారణంగా తాగి ఉన్న మహేష్‌ను కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సింగారపు గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మక్కువ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సమకూరుతుందని సీడీపీఓ బి.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోషణ బీ, పడాయి బీ శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పోషణ, విద్య అందించడమే దీని లక్ష్యమన్నారు. ఎంఈఓలు సత్యనారాయణ, శ్యాంసుందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.రాజశ్రీ, ఎన్.లీలావతి, రిసోర్సుపర్సన్ ఎం.అష్టలక్ష్మి, పి.పార్వతి, ఆర్.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

టీబీ అనుమానితులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మక్కువ: స్థానిక పీహెచ్‌సీలో ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి అనుమానితులకు టీబీ సూపర్‌వైజర్ నరేష్ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సెంట్రల్ టీబీ డివిజన్ వైద్య సిబ్బంది సీవై - టీసీ పరీక్షలు కొత్తగా ప్రవేశపెట్టిందన్నారు. ఈ పరీక్షలను మక్కువ పీహెచ్‌సీ పరిధిలోని టీబీ అనుమానితులకు చేశామన్నారు. 48 గంటల తరువాత ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షల్లో పాజిటివ్ వస్తే టీబీ మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ హరికృష్ణ, సీహెచ్‌ఓ నిర్మల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు..



వినతిపత్రాన్ని అందజేస్తున్న యూనియన్ నాయకులు

పార్వతీపురం: ఆప్కాస్ విధానం రద్దు చేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్ప వద్దని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.శంకరరావు, సీహెచ్ సింహాచలం, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ తదితరులు సంతకాల సేకరణ చేపట్టారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ విధానాలకు నిరసనగా కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం తన నిర్ణయం పునఃసమీక్షించేంత వరకు దశల వారీ ఆందోళన చేపడతామన్నారు. అనంతరం పమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఎం.శివబంగారి, రాజేష్, గంగయ్య, రవి, సుజాత, లక్ష్మితో పాటు డ్రైవర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ సేవాభావం



బలిజిపేట ఉన్నత పాఠశాలలో సేవచేస్తున్న కార్పెంటర్లు

బలిజిపేట: కార్పెంటర్స్ డే సందర్భంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో కార్పెంటర్లు ఉచితంగా మరమ్మతులు నిర్వహించారు. బలిజిపేటకు చెందిన శ్రీశ్రీ విశ్వకర్మ కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పెంటర్స్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో కుర్చీలు, బెంచీలు, తలుపులు, కిటికీలు తదితరమైన వాటికి సంబంధించి ఉచితంగా సేవలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మరమ్మతులకు అవసరమైన మెటీరియల్‌ను అందించగా కార్పెంటర్లు సేవాభావంతో పనిచేశారు. ఈ సందర్భంగా కార్పెంటర్లకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్పెంటర్స్ డేను ఈ విధంగా సేవాభావంతో నిర్వహించుకోవడం, అంతేకాక తాము చదువుకున్న ఉన్నత పాఠశాలకు సేవ చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇందుకు సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.జనార్దనరావు, టి.రాము, మురళి, కె.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో సీహెచ్‌ఈసీ గ్రూపు ప్రవేశపెట్టాలి



డీవీఈఓ మంజులవీణకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ట్స్ అధ్యాపకులు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియెట్‌లో సీహెచ్‌ఈసీ గ్రూపు ప్రవేశపెట్టాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులవీణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎంబైపీసీ అనే గ్రూపును ప్రవేశపెట్టిందని, అదేవిధంగా ఆర్ట్స్ విద్యార్థులకు కామర్స్, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ (సీహెచ్‌ఈసీ) గ్రూపును ప్రవేశపెట్టాలని కోరారు. ఈ గ్రూపు వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ఎంతో ఉపయోగకరమవుతుందని తెలిపారు. ఈ గ్రూపు వల్ల ప్రభుత్వానికి ఎటువంటి అదనపు ఆర్థిక భారం ఉండదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తెర్లి రవికుమార్, ఎన్.భాస్కరరావు, కె.వాసుదేవరావు, డి.మురళీధర్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీపేట ఉపసర్పంచ్ ఏకగ్రీవం

- రెడ్డి పకీరు నాయుడు ఎన్నిక



ఉపసర్పంచ్ పకీరునాయుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ప్రసాద్

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తేలు ధనంజయమ్మ అధ్యక్షతన గురువారం ప్రత్యేక ఎన్నికల అధికారి ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించడానికి అత్యవసర సమావేశానికి ఎంఎల్ఎన్ ప్రసాద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం 5వ వార్డు మెంబర్‌గా ఎన్నికైన రెడ్డి పకీరునాయుడు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలియజేశారు. అనంతరం సర్పంచ్ టి.ధనుంజయమ్మ ఆధ్వర్యంలో సభ్యులందరి సమక్షంలో ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు



పార్వతీపురం మండలం ముఖ ద్వారమైన వెంకంపేట గోరీల జంక్షన్ వద్ద బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు మండుటెండలోనే బస్సు వచ్చే వరకు నిరీక్షిస్తారు. ప్రధానంగా తాళ్లబురిడి, బందులుప్పి, జమదాల, పుట్టూరు, వెలగవలస, డి.శిర్లాం తదితర గ్రామాల్లో వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ జంక్షన్‌లో నిత్యం ఆటోలు, బస్సులు ఇతర వాహనాల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎండలోనే నిరీక్షిస్తున్నారు. రాత్రి పూట కూడా కనీసం ఇక్కడ విద్యుత్ దీపాలు లేక భయంభయంగా ఉంటున్నారు. - పార్వతీపురం రూరల్

నేడు రుణ ధ్రువపత్రాల పరిశీలన

పార్వతీపురం రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాల నిమిత్తం పార్వతీపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల వారి ధ్రువపత్రాలను శుక్రవారం పరిశీలించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.రమణమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు తమ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో మండల కార్యాలయానికి రావాలని సూచించారు. పరిశీలనతో మండల కార్యాలయ సిబ్బందితో పాటు సంబంధిత బ్యాంకు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న బీకేఎంయూ నాయకులు

పార్వతీపురం: గత ఏడు వారాలుగా చేస్తున్న ఉపాధి పనులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) నాయకులు జి.సూరయ్య, బి.మోహన్ కోరారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సకాలంలో ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో వేతనదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి బిల్లులు చెల్లించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.250కోట్లు అవినీతి జరిగినట్లు అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ప్రస్తావించారని, ఎక్కడా అవినీతి జరిగిందో ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, పనిదినాలు పెంచుతామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఏవీ కార్యరూపం దాల్చలేదన్నారు. పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలైన టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు కూడా కనిపించడం లేదన్నారు. వేతన దారులకు కనీసం పనిముట్లు కూడా అందజేయలేదన్నారు. సమస్యలు పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 31న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.ప్రసాద్, పి.మోహన్‌రావు పాల్గొన్నారు.